సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 4 । డిసెంబర్ । 2023



మార్కెట్ కలిపిన బంధం

జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో వ్యాపారంతో పాటు ఆత్మీయ పలకరింపులతో సందడిగా ఉంటుంది. 10లో



ముగిసిన 'నెరెడ్కో' ఎక్స్‌పో

పీఎంపాలెం దరి వి కన్వెన్షన్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నెరెడ్కో ప్రాపర్టీ ఎక్స్‌పో ఆదివారం సాయంత్రం ముగిసింది. 10లో



నవోదయం.. శుభోదయం

కొమ్మాదిలోని నవోదయ విద్యాలయంలో విద్యార్థుల భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేసేలా చదువులు సాగుతున్నాయి. 10లో

న్యూస్‌రీల్

జూ ఆదాయం రూ.6.19 లక్షలు



నీటి ఏనుగు కొలను వద్ద సందర్శకులు

ఆరిలోవ : ఇందిరా గాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. కార్తీక మాసం మూడో ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు జూను సందర్శించారు. పిల్లలు, పెద్దలు రోజంతా వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద సరదాగా గడిపారు. ఈమూలు, నెమళ్లు, ఆఫ్రికన్ చిలుకలు తదితర పలు రకాల పక్షులు, ఏనుగులు, కోతులు, చింపాంజీలు, పులులు, సింహాలు, అడవికుక్కలు, హైనాలు, మొసళ్లు, పాములు సందర్శకులను అలరించాయి. జూలో ఇటీవల ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద పిల్లలు సందడి చేశారు. ఏడు వేల మందికిపైగా సందర్శకులు జూను సందర్శించగా రూ.6.19 లక్షలు ఆదాయం లభించినట్లు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

అలరించిన నేవీ బ్యాండ్



మంత్రి అమర్‌నాథ్ దంపతులను జ్ఞాపికతో సత్కరిస్తున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింధియా: నేవీ డే పురస్కరించుకుని సముద్రిక నేవల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఇండియన్ నేవల్ సింఫోనిక్ బ్యాండ్ కాన్సర్ట్ ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆయన సతీమణి హిమగౌరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరికి తూర్పు నావికాదళ కమాండర్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఆయన సతీమణి, నవ ఈస్టర్న్ రీజియన్ ప్రెసిడెంట్ సంధ్య పెంధార్కర్ ఘన స్వాగతం పలికారు. కమాండర్ మనోజ్ సబాస్టియన్, లెఫ్టినెంట్ కమాండర్ జె.పద్మానాభన్ నేతృత్వంలో సాగిన వాయిద్య విన్యాసం ప్రేక్షకులను మైమరపించింది. అనంతరం మంత్రి అమర్‌నాథ్ దంపతులను రాజేష్ పెంధార్కర్ దంపతులు జ్ఞాపికను బహూకరించి.. సన్మానించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

విశాఖ విద్య: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. విశాఖ అర్బన్ పరిధిలో 10, భీమునిపట్నం పరిధిలో 6 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 2,073 మంది పరీక్షకు నమోదు చేసుకోగా, ఇందులో 76 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని కేడీపీఎం, ఎంవీడీ, ఎన్‌ఎంసీఎస్, కేడీవీఎం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీఈవో ఎల్.చంద్రకళ పరిశీలించారు. కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కథా-2022 పుస్తకావిష్కరణ



కథా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవి సిదారెడ్డి, శివారెడ్డి తదితరులు

సీతంపేట: కవులు, కథకులు, రచయితలకు సామాజిక బాధ్యత ఉందని ప్రముఖ కవి కె.శివారెడ్డి అన్నారు. కథా సాహితీ పేరిట మిత్ర సాహితీ, విశాఖపట్నం ప్రచురించిన కథా సంకలం కథా-2022 పుస్తకావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ప్రముఖ రచయిత గంట్యాడ గౌరునాయుడు అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి నందిని సిదారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిత్ర సాహితీ సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ ఏటా రకరకాల పత్రికల్లో వచ్చిన కథలు చదివి.. అందులో ఎంపిక చేసిన 10 నుంచి 15 కథలతో పుస్తకాన్ని ప్రచురించడం 1990 నుంచి పాపినేని శివశంకర్‌తో కలిసి చేస్తున్నట్టు తెలిపారు.కవి సిదారెడ్డి మాట్లాడుతూ రచయితలు ఉన్నత ప్రమాణాలతో కథలు రాయాలని సూచించారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, తానా ప్రచురణల కమిటీ చైర్‌పర్సన్ కన్నెగంటి చంద్ర, రచయితలు, అనువాదకులు ఎల్.ఆర్.స్వామి, కల్లూరి శ్యామ ల, కె.ఎస్.మల్లీశ్వరి, చింతకింది శ్రీనివాసరావు, వేణు మాస్టర్, విమర్శకులు విశాఖ వర్మ, సీపీఐ నాయకులు జె.వి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వాయు వేగం!

- విశాఖలో ఉధృతమైన హోరుగాలులు
- నేటి నుంచి మరింత తీవ్రతరం
- గంటకు 75 కి.మీల వేగానికి పెరిగే అవకాశం
- తుపాను తీరం దాటాక ఉత్తరాంధ్ర వైపు పయనం



తుపాను ధాటికి విశాఖలో ఎగసి పడుతున్న అలలు

సాక్షి, విశాఖపట్నం: తుపాను ప్రభావం విశాఖపై మొదలైంది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో గాలుల ఉధృతి శనివారం రాత్రి నుంచి ఆరంభమైంది. ఆదివారం తుపానుగా బలపడడంతో గాలుల తీవ్రత అధికమైంది. ఉదయం నుంచి శబ్దాలు చేసుకుంటూ హోరు గాలులు వీస్తూనే ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో సుడిగాలులు కొనసాగుతున్నాయి. వీటి ధాటికి ఇళ్ల కిటికీలు, తలుపులు కొట్టుకుంటున్నాయి. దుమ్ము, ధూళి చెలరేగి ద్విచక్ర వాహన చోదకులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న వారి కళ్లలో పడుతూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. సోమవారం తీవ్ర తుపానుగా మారనుండడంతో ఈదురుగాలుల తీవ్రత మరింత పెరగనుంది. ప్రస్తుతం గంటకు 45–55 కి.మీల వేగంతో జిల్లాలో ఈదురుగాలులు వీస్తున్నాయి. రానున్న రెండు రోజులు వీటి వేగం 65–75 కి.మీలకు చేరుకుంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. మరోవైపు మిచాంగ్ తుపాను మంగళవారం తీరాన్ని దాటనుంది. అనంతరం అది ఉత్తరాంధ్ర వైపు కదులుతుంది. ఆరో తేదీ వరకు తీవ్ర వాయుగుండం, వాయుగుండం, అల్పపీడనంగా క్రమంగా బలహీనపడుతూ ఉత్తరాంధ్ర వరకు పయనించనుంది. దీని ప్రభావం కూడా విశాఖపై ఉండనుంది.

6వ తేదీ వరకు వానలు

తుపాను ప్రభావంతో సోమవారం నుంచి విశాఖ జిల్లాలో వర్షాలు మొదలు కానున్నాయి. ఐఎండీ నివేదిక ప్రకారం సోమ, మంగళ, బుధవారాల్లో విశాఖతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో ఈదురుగాలులకు చలిగాలులు కూడా తోడై శీతల వాతావరణాన్ని ఉధృతం చేస్తోంది.

తీరానికి చేరుకుంటున్న బోట్లు

మరోవైపు సముద్రంలో చేపలవేటకు వెళ్లిన బోట్లు తీరానికి చేరుకుంటున్నాయి. బలమైన ఈదురుగాలులతో పాటు అలలు ఎగసి పడుతున్నందున వేటకు వెళ్లవద్దని ఇప్పటికే ఐఎండీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సముద్రంలో వేట సాగిస్తున్న బోట్లన్నీ ఒక్కొక్కటికీ తీరానికి వస్తున్నాయి.

ఎంఎస్‌ఎంఈలపై సర్వే!

- దీనిపై త్వరలో వార్డు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ
- ఏ పరిశ్రమకు ఏమి అవసరమో సర్వే ద్వారా గణన
- విశాఖ జిల్లాలో 14,433 ఎంఎస్‌ఎంఈలు
- వీటి ద్వారా 1.55 లక్షల మందికి ఉపాధి అవకాశాలు



ఎంఎస్‌ఎంఈ

సాక్షి, విశాఖపట్నం: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈల)పై సమగ్ర సర్వేకు రంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేయడం కోసం ఈ సర్వేను చేపడుతోంది. వార్డు, గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఈ సర్వే నిర్వహించనున్నారు. ఇటీవల వీరికి సర్వేపై ఆన్‌లైన్‌లో ప్రాథమికంగా అవగాహన కల్పించారు. త్వరలో వీరికి జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం సర్వేను మొదలు పెడతారు. సర్వేలో వివిధ రంగాల వారీగా ఎన్ని ఎంఎస్‌ఎంఈ యూనిట్లున్నాయి? వాటి ఉత్పత్తి పరిమాణం ఎంత? భవిష్యత్తు అవసరాలేమిటి? మానవ వనరుల లభ్యత, నైపుణ్య సిబ్బంది ఎంత మంది ఉన్నారు? ఏ తరహా నిపుణులు ఎంతమంది అవసరం? వంటి వాటిపై సమగ్రంగా సర్వే చేస్తారు. ఈ అంశాలు ఎంఎస్‌ఎంఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. సర్వేను అనుసరించి అవసరమైన నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో శిక్షణనిచ్చి ఎంఎస్‌ఎంఈల్లో నియామకాలు చేపడతారు. మరికొద్ది రోజుల్లోనే ఈ సర్వే ప్రక్రియను ప్రారంభిస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్.గణపతి 'సాక్షి'కి చెప్పారు.

జిల్లాలో 14,433 ఎంఎస్‌ఎంఈలు

విశాఖ జిల్లాలో ఉత్పత్తి ప్రారంభించిన ఎంఎస్‌ఎంఈలు 14,433 ఉన్నాయి. వీటిలో స్ట్రక్చరల్ ఫ్యాబ్రికేషన్, బేకరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, రీసైక్లింగ్ యూనిట్లు, మెడికల్, మాడ్యులర్ ఫర్నిచర్, కోల్డ్ స్టోరేజీలు, లేబరేటరీలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, రెడీమేడ్ గార్మెంట్స్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రిక్ రిపేర్లు, గూడ్స్/పాసింజర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసులు, కన్వెన్షన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, ఆయిల్ మిల్లులు, పీవీసీ పైపులు, వాటర్ ప్లాంట్లు, టెంట్ హౌస్‌లు వంటివి ఉన్నాయి. వీటి ద్వారా రూ.8,240.73 కోట్ల పెట్టుబడి సమకూరింది. వీటిలో 1,55,732 మంది ఉపాధి పొందుతున్నారు. ఇంకా ప్రారంభం కావలసిన ఎంఎస్‌ఎంఈలు 34 ఉన్నాయి. వీటితో మరో 670 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

పవళింపు సేవ సమయంలో దర్శనాలా?

- చంద్రబాబుకు దర్శనం కల్పించడంపై భక్తుల విస్మయం
- ఆలయ అధికార, వైదికుల తీరుపై విమర్శలు



రాజగోపురం ఎదురుగా టీడీపీ జెండాలతో పార్టీ శ్రేణులు, అభివాదం చేస్తున్న చంద్రబాబు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పవళింపు సేవ సమయంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు దర్శనం చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ సమయంలో ఆయనకు దేవస్థానం వర్గాలు దర్శనం కల్పించడం పట్ల భక్తులు విస్మయం చెందారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు స్వామికి పవళింపు సేవ నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల దర్శనాలు నిలుపుదల చేస్తారు. కానీ చంద్రబాబు కోసం ఆలయ అధికార, వైదికులు ఆదివారం ఆ సమయం మార్చడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు సింహగిరికి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వచ్చారు. అప్పటికే భక్తుల దర్శనాలు నిలుపుదల చేశారు. సుమారు ముప్పావుగంట సమయం చంద్రబాబు ఆలయంలో ఉన్నారు. ఆయన బయటకు వచ్చిన తర్వాత స్వామికి పవళింపుసేవ చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామి పవళింపు సమయం మార్చడంపై ఆలయ అధికార, వైదికులు ఏం సమాధానం చెబుతారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు మధ్యాహ్నం 12.25కి సింహగిరికి చేరుకోవాలి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు స్వామిని దర్శించుకోవాలి. కానీ ఆయన సరిగ్గా పవళింపు సేవ సమయానికి వచ్చారు. దేవస్థానం వర్గాలు ముందస్తు చర్యలు తీసుకోకుండా పవళింపు సమయంలోనే ఆయనకు స్వామి దర్శనం కల్పించారు. ఈ విషయంపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని వివరణ కోరగా వైదికుల సూచనలతో ఆ సమయంలో చంద్రబాబును దర్శనానికి అనుమతించామన్నారు. ఆయన వెళ్లిన తర్వాత పవళింపు సేవ చేసినట్లు వివరించారు. ఇక టీడీపీ శ్రేణులు అడుగడుగునా అత్యుత్సాహం ప్రదర్శించారు. ఘాట్‌రోడ్డులో పార్టీ జెండాలతో యథేచ్ఛగా తిరిగారు. రాజగోపురం ఎదురుగా ఉన్న పాత ఎంక్వైరీ కార్యాలయం ప్రాంగణం వరకు జెండాలు పట్టుకొని హడావుడి చేశారు. అంతకుముందు ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చిన చంద్రబాబుకు విమానాశ్రయంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: మిచాంగ్ తుపాను కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. 4వ తేదీన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ (06073) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 5వ తేదీన భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 6వ తేదీన ఎర్నాకుళం-టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్, 7వ తేదీన ఎస్‌ఎంవీ బెంగళూరు-గౌహతి (12509) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

గడప గడపకూ అభివృద్ధి

- జిల్లా వ్యాప్తంగా చురుగ్గా ప్రజా సమస్యల పరిష్కారం
- 'గడప గడపకు మన ప్రభుత్వం' పనులకు పెద్ద పీట
- 901 పనులకు రూ.72.82 కోట్లు మంజూరు
- ఇప్పటికే 352 పనులు పూర్తి చేసిన అధికారులు
- పురోగతిలో 235, టెండరు దశలో 314 పనులు



నాడు: పిలకవానిపాలెంలో రోడ్డు దుస్థితి



నేడు: కొత్త రోడ్డు వేసిన తర్వాత..

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రాధాన్యత పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా పరిధిలో మొత్తం 901 పనులకు అనుమతులు రాగా.. ఇందుకోసం రూ.72.82 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి నియోజకవర్గం పరిధిలోనూ పనుల పురోగతిపై కలెక్టర్ మల్లికార్జున ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి.. వేగవంతం చేస్తున్నారు.

నాలుగున్నరేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసింది.? ఇంకా ఏం చేయాలి? స్థానికంగా నెలకొన్న సమస్యలేంటి? తదితర విషయాలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు సచివాలయాల సందర్శన సందర్భంగా ప్రజల నుంచి సమస్యలు విన్నారు. వారు సూచించిన వాటిలో అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన పనులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. జిల్లా పరిధిలో అత్యంత ప్రాధాన్యతగా మొత్తం 959 పనులను గుర్తించగా.. ఇందులో రూ.72.82 కోట్ల విలువైన 901 పనులకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఇప్పటి వరకు 352 పనులు పూర్తికాగా.. మరో 235 పనులు పురోగతిలో ఉన్నాయి. మరో 314 పనులు టెండరు దశలో ఉన్నాయి.

నియోజకవర్గాల వారీగా ప్రాధాన్యత పనుల వివరాలు

నియోజకవర్గం	గుర్తించిన పనులు	మంజూరైన పనులు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)	పూర్తయిన పనులు
భీమిలి	327	299	20.40	65
గాజువాక	71	61	6.86	46
పెందుర్తి మండలం	119	111	6.38	17
విశాఖ తూర్పు	130	123	9.98	63
విశాఖ ఉత్తరం	123	119	13.35	43
విశాఖ దక్షిణం	92	92	7.49	77
విశాఖ పశ్చిమ	97	96	8.38	41
మొత్తం	959	901	72.82	352

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పనులే అధికం

జిల్లాలో సింహభాగం జీవీఎంసీ పరిధి ఉంది. ఈ కారణంగా గడప గడపకు ప్రాధాన్యత పనుల్లో ఎక్కువగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించినవే ఉన్నాయి. ఇప్పటి వరకు జీవీఎంసీ పరిధిలో 782 పనులను గుర్తించగా.. 625 పనులు ప్రారంభమయ్యాయి. 345 పనులు పూర్తయ్యాయి. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి 101 పనులు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటివరకు 60 పనులు పూర్తి చేయగా.. 41 పనులు పురోగతిలో ఉన్నాయి. వీటితో పాటు పంచాయతీరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ... పీడీసీఎల్, ఆర్ అండ్‌బీ ఇతర పనులు జోరుగా కొనసాగుతున్నాయి. కలెక్టర్ డా.మల్లికార్జున ఈ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటూ.. జోరుగా కొనసాగేందుకు చర్యలు చేపడుతున్నారు.

దివ్యాంగులందరికీ ఆరోగ్య బీమా

- సంజీవని నిధి నుంచి చెల్లింపు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి
- ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

బీచ్‌రోడ్డు: అంగవైకల్యం కలిగిన ప్రతి ఒక్కరికీ జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని, వారి సంక్షేమం, ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. అంతర్జాతీయ ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, తద్వారా ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. జిల్లాలోని దివ్యాంగులందరికీ ఆరోగ్య బీమా కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా ఆరోగ్య బీమా వర్తించని వారికి సంజీవని నిధి నుంచి చెల్లింపులు చేస్తామన్నారు. తల్లిదండ్రులు లేని వారికి మిషన్ వాత్సల్య ద్వారా నెలకు రూ.4వేల ఫించన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిరామయ పథకం ద్వారా వైద్య పరమైన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేశామని, త్వరలో ఇంకో 37 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. స్వచ్ఛంద కార్పొరేట్ సంస్థల సహకారంతో స్కూటీలు, వివిధ పరికరాలు అందజేశామన్నారు.

పది రోజుల్లో ఓటు హక్కు

18 ఏళ్లు నిండిన విభిన్న ప్రతిభావంతులు ఆయా సచివాలయాలు, బీఎల్‌వోల వద్ద ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కేవలం 10 రోజుల్లో ఓటు హక్కు కల్పిస్తామన్నారు.

అందరితో పాటే హక్కులు

అందరితో పాటు దివ్యాంగులకు అన్ని రకాల హక్కులు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగిన న్యాయ సేవా సదన్‌లో సంప్రదించాలని, అని విధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. పట్టుదల, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని, జీవితంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

బహుమతుల ప్రదానం

వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నిరామయ పథకంలో భాగంగా పలువురికి ఆరోగ్య కార్డులు అందించారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలు, పాఠశాలలు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. దేశ భక్తి, జాతీయతను చాటుతూ వారు చేసిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. మూగ, చెవిటి చిన్నారులు, అంగవైకల్యం కలిగిన పిల్లలు వివిధ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ అబ్బురపరిచారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి, డీఈవో ఎల్.చంద్రకళ, సర్వ శిక్ష ఏపీడీ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





డ్యాన్స్‌లు చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

బోల్తా పడిన సూపర్‌స్టార్స్



రజాక్ ఓవర్లలో ఔటైన ధ్రువ్. క్యాచ్ పట్టిన దిండాను అభినందిస్తున్న శ్రీవత్స్



బంతిని బౌండరీకి తరలిస్తున్న గుజరాత్ జెయింట్స్ బ్యాటర్

కీలక మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: కచ్చితంగా విజయం సాధించాల్సిన మ్యాచ్‌లో సదరన్ సూపర్ స్టార్స్ బోల్తాపడింది. పీఎం పాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ-20లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టీ-20 లీగ్‌లో ఇరు జట్లకు ఇదే చివరి మ్యాచ్. నాకవుట్ లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగాయి. జెయింట్స్ కెప్టెన్ కెవిన్ టాస్ గెలిచి లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో సూపర్ స్టార్స్ రాస్ టేలర్ సేన తొలుత బ్యాటింగ్‌కు దిగింది. తరంగ, జెస్సీ ఓపెనర్స్‌గా రాగా.. శ్రీశాంత్ ఇన్నింగ్స్ తొలి బంతిని విసిరాడు. జట్టు స్కోర్ 18 పరుగుల వద్ద ఈశ్వర్ చౌదరి ఓవర్‌లో జెస్సీ వికెట్ల వెనుక రావల్‌కు దొరికిపోయి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. రెండో వికెట్‌కు తరంగ- శ్రీవత్స్ 55 పరుగులు జోడించడంతో పాటు బౌండరీల మోత మోగించారు. చివరికి సదరన్ సూపర్ స్టార్స్ జట్టు ఎనిమిది వికెట్లకు 159 పరుగులతో ఇన్నింగ్స్ ముగించింది. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన జెయింట్స్ ఓపెనర్ ధ్రువ్ రావల్ డకౌట్‌గా తొలి వికెట్ కోల్పోయింది. ఇన్నింగ్స్ చక్కదిద్దే క్రమంలో మరో ఓపెనర్ కెవిన్(29) వెనుదిరగ్గా అతని స్థానంలో వచ్చిన రిజర్డ్ కేవలం ఒక పరుగే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ స్థితిలో వచ్చిన అభిషేక్(81) 10 ఫోర్లు, మూడు సిక్సర్లతో అభిమానులను అలరించాడు. అతనికి చిరాగ్(21)తోడయ్యాడు. చివర్లో చిగుంబురా(21) 10 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు బాది మరో ఎనిమిది బంతులుండగానే జట్టును విజయతీరానికి చేర్చాడు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో అభిమానులు హాజరై మ్యాచ్‌ను వీక్షించారు.

నేడు మణిపాల్ టైగర్స్‌తో అర్బన్ రైజర్స్ ఢీ

లీగ్‌లో చివరి మ్యాచ్ సోమవారం మణిపాల్ టైగర్స్, అర్బన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనుంది. ఈ రెండు జట్లు మూడేసి మ్యాచ్‌ల్లో విజయంతో, ఓ పరాజయంతో ఆరేసి పాయింట్లు సాధించాయి. జెయింట్స్ ఏడు పాయింట్లతో ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్‌కు వర్షం పడే సూచనలున్నాయి. ఒకవేళ వర్షం పడకుండా పూర్తి మ్యాచ్ జరిగితే జెయింట్స్ ఆధిక్యాన్ని కోల్పోనుంది. కాగా.. ఒకే ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించిన క్యాపిటల్స్, సూపర్‌స్టార్స్, కింగ్స్ జట్లు మూడేసి పాయింట్లతో లీగ్‌ను ముగించాయి. కాస్త మెరుగైన రన్‌రేట్‌తో క్యాపిటల్స్ జట్టు నాకవుట్‌కు చేరుకుంది. లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ-20 నాకవుట్ మ్యాచ్‌లు సూరత్‌లో జరగనున్నాయి.

మార్కెట్ అంటే.. కొందరి వ్యక్తుల మధ్య జరిగే వ్యాపారం. రైతు సరకు ఉత్పత్తి చేస్తాడు. వ్యాపారి వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తాడు. వినియోగదారుడు ఆ సరకులను కొనుగోలు చేస్తాడు. ఇంతేనా.? మరో కోణంలో చూస్తే.. సరికొత్త బంధం కనిపిస్తుంది. రక్త సంబంధం లేకపోయినా.. బంధువులు కాకపోయినా.. అందరూ వ్యాపారులు, కొనుగోలుదారులే అయినప్పటికీ.. ఇంటి మనుషుల్లా వ్యవహరించే తీరు ఆకర్షిస్తుంది. ఏం అక్కా బాగున్నావా.? రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. మంచి క్యారెట్ వచ్చింది. తీసుకెళ్లు.! హాయ్ అన్నా.. క్యాబేజీ బాగుంది.. గిట్టుబాటవుతుంది.! ఏం బావా లేటైంది.. ఇంకొంచెం ముందు వచ్చుంటే.. బాగుండేది.. మంచి క్వాలిటీ క్యాప్సికమ్ వచ్చింది.. ఇలాంటి ఆప్యాయతల పిలుపుతో మార్కెట్ సందడిగా ఉంటుంది. పని ఒత్తిడిని దూరం చేస్తుంది. ఇలాంటి ప్రపంచం జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో మనకు తారసపడుతుంది.

– విశాఖపట్నం డెస్క్

మార్కెట్ కలిపిన బంధం




జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్

- ఉపాధినిస్తున్న జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల మందికి పని
- వ్యాపారులు, కొనుగోలుదారుల మధ్య పెనవేసుకున్న అనుబంధం

జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌పై ఆధారపడిన వ్యాపారులు, గుమస్తాలు, కలాసీలు, ఇక్కడ సరకులు కొనుగోలు చేసి నగరంలో విక్రయించే వారి దినచర్య ప్రతి రోజూ వేకువ జాము 3 గంటలకే ప్రారంభమవుతుంది. రైతులు పండించిన పంటలు ఎక్కడెక్కడి నుంచో జ్ఞానాపురం మార్కెట్‌కు చేరుకుంటాయి. వ్యాపారులు దగ్గరుండి కలాసీల ద్వారా సరకులు దింపిస్తారు. మీకేంటి రెండు చేతులా సంపాదిస్తారు అంటాం గానీ.. సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు 10 గంటల వరకు వీళ్ల ఒళ్లంతా కళ్లు చేసుకుంటే కానీ వ్యాపారం సాగదు. కూరగాయలు, ఆకుకూరలు ఏ రోజుకు ఆ రోజు విక్రయాలు పూర్తి చేస్తే హ్యాపీ.. ధర బాగుండి.. డిమాండ్ ఉంటే ఒకే.. లేకపోతే ఆ రోజు నష్టం తప్పదు. ఇక ఒక్కో దుకాణం మీద ఆధారపడి పదుల సంఖ్యలో గుమస్తాలు, కలాసీలు ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరికి జీతాలు, రోజువారీ కూలీ ఇస్తుండగా.. మరికొందరు చేతనైన పనిచేస్తూ ఇచ్చింది తీసుకెళ్తుంటారు. ఒక్కసారి కూరగాయల మార్కెట్‌లోకి అడుగుపెడితే ఓ ప్రపంచమే కళ్ల ముందు కనిపిస్తుంది. రైతు కష్టం, కలాసీ జీవనం, వ్యాపారి మార్కెటింగ్ వ్యూహం తెలుస్తుంది.


పచ్చిమిర్చి విక్రయిస్తున్న వ్యాపారులు


మార్కెట్ నుంచి కూరగాయల తరలింపు

ఉదయాన్నే మరో ప్రపంచం

కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న సరకును ఇక్కడి వ్యాపారులు ఉదయం 3.30 గంటల నుంచి విక్రయానికి ఉంచుతారు. ఇక్కడి నుంచి రైతు బజార్ల వ్యాపారులు, హోటళ్ల యజమానులు, రిటైల్ వ్యాపారులు, హోటళ్లకు సరఫరా చేసే వారు, తోపుడు బండ్ల వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేస్తారు. కొంత మంది వ్యాపారులు రిటైల్‌గా కూడా విక్రయిస్తారు. ఇక్కడ కొనుగోలు చేసిన వాళ్లు తిరిగి వాటిని ఇళ్ల వద్ద దుకాణాల్లో, తోపుడు బండ్లపై విక్రయిస్తుంటారు. ఇలా మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్కెట్‌లో హడావిడి కనిపిస్తుంది.

కరోనా సమయంలోనూ..

మార్కెట్‌కు ప్రతీ ఆదివారం సెలవు. సంక్రాంతి, దసరా, మే డే, నాగులచవితి తదితర రోజుల్లో సెలవు ఉంటుంది. మిగతా అన్ని రోజులు పనిచేస్తుంది. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలోనూ మార్కెట్ తెరిచారు. మార్కెట్‌కు పక్కనే ఉన్న శ్మశానవాటికలో ఓ పక్క మృతదేహాలు కాలుతుంటే.. ఇక్కడ వ్యాపారులు, కలాసీలు, గుమస్తాలు ధైర్యంగా పనిచేసి.. నిత్యావసరాల్లో భాగమైన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూశారు. కరోనాకు ఎదురొడ్డి నిలిచి అందరి ఆకలి తీర్చారు.

మార్కెట్ చరిత్ర

నగరంలో కూరగాయల మార్కెట్ అంటే **టక్కు**న గుర్తొచ్చేది పూర్ణా మార్కెట్. బ్రిటిష్ ప్రభుత్వం 1935లో నిర్మించిన ఈ మార్కెట్ స్వాతంత్ర్యం అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్‌గా మారింది. సొంత భవనాల్లో వ్యాపారులు హోల్‌సేల్‌గా కూరగాయలు, పండ్లు, కిరాణా సరకులు విక్రయించేవారు. రోజురోజుకూ వినియోగదారుల తాకిడి పెరగడం, రోడ్లపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. 1988లో అప్పటి మేయర్ డి.వి. సుబ్బారావు, కమిషనర్ మహంతి కూరగాయలు, పండ్లు, అరటి పండ్ల వ్యాపారులతో సమావేశమయ్యారు. వేరే ప్రాంతంలో పునరావాసం కల్పిస్తామని, హోల్‌సేల్ మార్కెట్లు తరలించాలని ప్రతిపాదన చేశారు. మొదట్లో ససేమిరా అన్న వ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో కొన్ని షరతులతో ఒకే చెప్పారు. ఈ క్రమంలో జ్ఞానాపురంలో స్థలం కేటాయించడంతో.. సొంతంగానే వ్యాపారులు షెడ్‌లు వేసుకున్నారు. అలా 1990లో హోల్‌సేల్‌గా కూరగాయల విక్రయాలు ప్రారంభమయ్యాయి. మొదట్లో సరిగ్గా వ్యాపారాలు సాగలేదు. అందరూ పూర్ణా మార్కెట్‌కే వెళ్లేవారు. 2000 సంవత్సరం నుంచి వ్యాపారాలు ఊపందుకున్నాయి. మొదట్లో ఇక్కడకు వస్తామన్న అరటి పండ్లు, పండ్ల వ్యాపారులు తర్వాత రాలేదు. 33 ఏళ్లుగా ఈ మార్కెట్ నగర ప్రజల కూరగాయల అవసరాలు తీరుస్తోంది. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఇదీ మార్కెట్ స్వరూపం

మార్కెట్ ప్రారంభం	1990
విస్తీర్ణం	1.7 ఎకరాలు
దుకాణాలు	66
కలాసీలు	సుమారు 1,000
గుమస్తాలు	400 నుంచి 500
రిక్షా కార్మికులు	200 నుంచి 300
ఆటో కార్మికులు	300 నుంచి 400
లారీ కార్మికులు	300 నుంచి 400
పరోక్షంగా ఉపాధి పొందుతున్న కుటుంబాలు	5 వేలు

కూరగాయలు వచ్చేది ఇలా..



మహారాష్ట్ర నుంచి ఉల్లి, పశ్చిమ బెంగాల్ నుంచి బంగాళాదుంపలు(పాత), ఇండోర్ నుంచి కొత్త బంగాళాదుంపలు, కర్నాటక నుంచి టమాటా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, బిహార్ నుంచి చిక్కుడు, మిర్చి, బీన్స్, పొటల్స్, గ్రీన్ ప్రీస్, బెండ, దొండ, కీర, ఆనపకాయ, హైదరాబాద్ నుంచి బీట్‌రూట్, క్యారెట్, కర్నాటక నుంచి క్యాప్సికం, అల్లం, బీన్స్ తదితర కూరగాయలు ఈ మార్కెట్‌కు వస్తాయి. మన రాష్ట్రంలో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉత్పత్తయ్యే కూరగాయాలు మార్కెట్ వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు. మదనపల్లి నుంచి టమాటా, విజయవాడ నుంచి కరివేపాకు, చింతల అగ్రహారం ఆకుకూరలు, అరకు, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల నుంచి అల్లం, బీన్స్, పార్వతీపురం, రామభద్రాపురం, కొవ్వూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి కాలీఫ్లవర్, కత్తిపూడి, పిఠాపురం, ద్వారపూడి తదితర ప్రాంతాల నుంచి బెండ తదితర కూరగాయలు వస్తాయి.

వైష్ణవి మార్కెట్‌గా పేరు నిర్ణయించాం



పూర్ణామార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ పెరగడంతో అప్పటి మేయర్, కమిషనర్ కోరిక మేరకు జ్ఞానాపురంలో షెడ్‌లు వేసుకుని హోల్‌సేల్ మార్కెట్‌ను ప్రారంభించాం. 33 ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం సాగిస్తున్నాం. ఇక్కడ వ్యాపారులు, కలాసీలతో ఓ అనుబంధం ఉంది. ఇన్ని రోజులు మార్కెట్‌కు పేరంటూ లేదు. అందరూ చావులమదుం మార్కెట్ అని పిలుస్తున్నారు. ఇలా పిలవడం ఇబ్బందికరంగా ఉంది. అందుకే వైష్ణవి హోల్‌సేల్ వెజిటెబుల్ మార్కెట్‌గా పేరు పెట్టాలని అందరం కలిసి తీర్మానించాం. ఈ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి.. రిజిస్టర్ చేయాలనుకుంటున్నాం.

– కొణతాల వీర్రాజు, యూనియన్ అధ్యక్షుడు

మంచి వాతావరణంలో వ్యాపారం



నా 14వ ఏటనే ఈ వ్యాపారంలోకి వచ్చాను. నాన్న పేరుతో షాపు కొనసాగుతోంది. మార్కెట్‌లో మొత్తం 66 దుకాణాలు ఉన్నాయి. దాదాపు 1000 మంది వరకు కలాసీలు ఉన్నారు. ఇక్కడ మంచి వాతావరణం ఉంటుంది. కలాసీలను వ్యాపారులంతా కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. మార్కెట్‌లో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటాం. మార్కెట్‌కు చెందిన సౌభాగ్య గణపతి ఆలయంలో చైర్మన్ కోరిబిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతీవారం అన్నదానం నిర్వహిస్తున్నాం.

– విల్లూరి పరమేశ్వరరావు, యూనియన్ కార్యదర్శి

ఎన్నో జ్ఞాపకాలున్నాయి..



నాది వాడచీపురుపల్లి. పూర్ణా మార్కెట్ ప్రాంతంలో ఉంటున్నాను. మొదట్లో పూర్ణామార్కెట్‌లో కలాసీగా పనిచేసే వాడిని. జ్ఞానాపురంనకు మార్కెట్ తరలిరావడంతో అప్పటి నుంచి ఇక్కడే పనిచేస్తున్నాను. నాకు ఇద్దరు ఆడపిల్లలు. కలాసీగా పనిచేస్తూనే పెద్ద అమ్మాయిని ఎంఎస్సీ, చిన్న అమ్మాయిని బి.టెక్ చదివించి.. పెళ్లిళ్లు చేశాను. అర్ధరాత్రి 2 గంటలకు నిద్ర లేస్తాను. చద్దన్నం పట్టుకుని మూడు గంటలకు మార్కెట్‌కు వచ్చేస్తాను. ఇక్కడ పని చూసుకుని మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వెళ్తాను. అప్పట్లో రూ.300 నుంచి రూ.400 వరకు ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.800 నుంచి రూ.1000 వరకు వస్తోంది. ఈ మార్కెట్‌తో ఎన్నో జ్ఞాపకాలు పెనవేసుకున్నాయి.

– రెడ్డి ముత్యాలనాయుడు, కలాసీ

20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా



ఈ మార్కెట్‌తో ఎంతో అనుబంధం ఉంది. 20 ఏళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నా. వేకువ జామున 3.30 గంటలకే మార్కెట్‌కు చేరుకుంటాం. లావాదేవీలన్నీ పూర్తయ్యే సరికి మధ్యాహ్నం 12 గంటలు దాటిపోతుంది. కరోనా సమయంలోనూ మార్కెట్‌ను తెరిచాం. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నగర ప్రజలకు తాజా కూరగాయలు అందించాం.

– రొంగళి ప్రకాష్‌రావు, వ్యాపారి

విశ్రాంత ఆర్డీ డాక్టర్ వెంకటేశ్వరరావు కన్నుమూత



మద్దిలపాలెం: వైద్య ఆరోగ్యశాఖలో రీజినల్ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ పుప్పాల వెంకటేశ్వరరావు(85) ఆదివారం కన్నుమూశారు. ఆయన పిఠాపురంకాలనీలో నివాసముంటున్నారు. వృద్ధాప్యంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వెంకటేశ్వరరావు మృతి పట్ల పిఠాపురంకాలనీ వాసులు, షిర్డీసాయి భక్తులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కాపులంతా సమన్వయంతో మెలగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ఆరిలోవ: ముడసర్లోవ పార్కులో విశాఖ కాపు యూత్ కార్తీక వన భోజన మహోత్సవం ఆదివారం నిర్వహించారు.పార్టీలకు అతీతంగా కాపు సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కాపు సామాజిక వర్గం ప్రముఖులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వల్లస్ సీఈవో గేదెల శ్రీనుబాబు, డాక్టర్ పీవీ సుధాకర్, సింహాచలం దేవస్థానం ట్రస్టు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు మాట్లాడారు. తూర్పు కాపు, మున్నూరు కాపు, తెలగ, బలిజ అందరూ ఒక్కటేనని తెలిపారు. ఎలాంటి భేదం లేకుండా కాపులంతా ఒకటిగా కలసిమెలసి మెలగాలన్నారు. జీవీఎంసీ యూనియన్ నాయకుడు మహదేవ ఆనంద్, తోటరాజు, మూర్తి, గుంటూరు నర్సింహమూర్తి, విశాఖ కాపు యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్, కార్యదర్శి వై.సురేష్, కోశాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి


మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

పీఎం పాలెం: అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే అన్నారు. ఆదివారం శిల్పారామంలో జిల్లా కళింగ ఆర్యవైశ్యుల వనసమారాధనలో ఆయన ప్రసంగించారు. తమ సమస్యలను తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సుమారు 2 వేలకు మందికిపైగా కళింగ ఆర్యవైశ్య కుటుంబాలు రోజంతా ఉత్సాహంగా గడిపారు.

సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో..

నగర ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వల్లూరి నూకరాజు ఏడాదికొకసారి ఇలా కుటుంబాలతో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పూసర్ల సురేష్ కుమార్, ట్రెజరర్ గ్రంధి దుర్గా ప్రసాద్, పిక్నిక్ నిర్వాహక చైర్మన్ పి. వంశీధర పాల్గొన్నారు.

చికిత్సతో డిమెన్షియాను నయం చేసుకోవచ్చు

తాటిచెట్లపాలెం : డిమెన్షియా రావడానికి ప్రధాన కారణం అల్జీమర్స్ అని ఆంధ్ర మెడికల్ కాలేజీ న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం దొండపర్తి స్టేషన్ రోడ్‌లోని హోటల్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, డిమెన్షియా ఇండియా అలయన్స్, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిమెన్షియాను ముందుగానే గుర్తించినట్లయితే సమర్థవంతమైన చికిత్సతో నయం చేసుకోవచ్చన్నారు. గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజీ సైక్రియాట్రిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎస్ రాజు, డిమెన్షియా ఇండియా అలయన్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్ రాజు మాట్లాడుతూ డిమెన్షియా మెదడులోని నరాల కణాలను దెబ్బతీస్తుందని, ఇది మెదడులోని అనేక ప్రాంతాల్లో సంభవించవచ్చన్నారు. వయసు, మానసిక క్షీణత వల్ల డిమెన్షియాకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎల్పీజీ డివిజనల్ సేల్స్ హెడ్ వై.రవికుమార్, ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ ఎన్.గోపాలకృష్ణ, స్నేహసంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ చైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

ముగిసిన నెరెడ్కో ప్రాపర్టీ ఎక్స్‌పో


రక్తదానం చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: పీఎంపాలెం దరి వి కన్వెన్షన్ నిర్వహిస్తున్న నెరెడ్కో ప్రాపర్టీ ఎక్స్‌పో ఆదివారం సాయంత్రం ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమానికి నగరంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన కస్టమర్లు తరలివచ్చి స్టాళ్లను సందర్శించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బంపర్ డ్రా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నెరెడ్కో) రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్, విశాఖ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాపారావు, రమేష్, సుబ్బారావు, సుఖీభవ హోమ్స్ హాస్సేన్, సర్దార్ నెస్ట్ ఎండీ వెంకన్న చౌదరి, మండవ సతీష్, వైశాఖి డెవలపర్స్ సాగర్, భూమాత ప్రాపర్టీస్ పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయం.. విద్యార్థులకు శుభోదయం

- విద్యార్థుల భవితకు బంగారు బాటలు
- 6, 9వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఏర్పాట్లు
- బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి స్పెషల్ డ్రైవ్
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన అడ్మిషన్లు

విశాఖ విద్య: జిల్లాలోని కొమ్మాదిలో గల నవోదయ విద్యాలయంలో విద్యార్థుల భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేసేలా ఉన్నత ప్రమాణాలతో చదువులు సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అండగా నిలుస్తోండటంతో ఇక్కడి విద్యార్థులు చదువులతో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన సాగుతుండటంతో కొమ్మాది నవోదయ విద్యాలయంలో చేరేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరో తరగతిలో సీటు లభిస్తే, 12వ తరగతి (ఇంటర్మీడియెట్) వరకు ఇక్కడ ఉచితంగానే చదువుకోవచ్చు. 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నవోదయ విద్యాలయ అధికారులు సిద్ధమయ్యారు. 6, 9వ తరగతులతో పాటు, ఇంటర్ మొదటి సంవత్సరంలో అర్హులైన ప్రతిభ గల విద్యార్థులకు అడ్మిషన్ కల్పించే నిమిత్తం ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 12 సీట్లు, 9వ తరగతిలో 11 సీట్లు ప్రస్తుతం ఖాళీ ఉండటంతో వీటి భర్తీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు


కొమ్మాదిలోని నవోదయ విద్యాలయం

ఎన్ఈపీ అమలుతో క్రేజ్

కొమ్మాదిలోని నవోదయ విద్యాలయంలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు సైతం వర్తింపజేస్తున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరంలో 442 మంది చదువుతున్నారు. వీరిలో బాలురు 235 మంది, బాలికలు 207 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన విద్యాలయంలో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన సాగే నవోదయ విద్యాలయానికి క్రేజ్ బాగా పెరిగింది.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పెద్దపీట

6వ తరగతిలో ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున మొత్తం 80 మందికి ప్రవేశం కల్పించనున్నారు. అదే విధంగా 12వ తరగతి (ఇంటర్మీడియట్)లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ గ్రూపుల్లో మొత్తం 45 మందికి అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా ఇక్కడ ఎక్కువగా చదువుకుంటున్నారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం 2024 జనవరి 10న, ఇంటర్మీడియట్‌కు ఫిబ్రవరి 10న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకే సీటు సొంతమౌతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంతం వారికి 25 సీట్లు కేటాయించనున్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



పేద వర్గాలకు చెందిన పిల్లలే ఇక్కడ చదువుతున్నారు. వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా చదువులు చెబుతున్నాం. కార్పొరేట్ మాదిరి బట్టీ చదువులు కాకుండా, ఒత్తిడి లేని చదువులు అందిస్తాం. ఆటపాటలతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు ఇస్తున్నాం. విద్యార్థులకు దేశంలో ఎక్కడ పోటీలు జరిగినా మా నవోదయ విద్యాలయ పిల్లలు భాగస్వామ్యయ్యేలా శ్రద్ధ తీసుకుంటాం.

– కె.సంజయ్, ప్రిన్సిపాల్, కొమ్మాది నవోదయ విద్యాలయం